


'పసిడీ! పడిపోతావ్, ఏమిటా పరుగు?' అమ్మమ్మ మందలింపును లెక్క చెయ్యకుండా పరుగెట్టి కనుమరుగైంది అప్పుడే యౌవన ప్రాంగణంలో అడుగు పెట్టిన రాణి.

'ఆడ పిల్లకు ఇంత విరగబాటు తగదమ్మా. పిదప కాలమూ, పిదప బుద్ధులూనూ' గొణుక్కుంది అరవయ్యవ పడిలో పడిన లక్ష్మమ్మ. అక్కడేవున్న వసంత అందుకుంది,

'అయితే ఇది మీ కాలం అనుకున్నావా అమ్మమ్మా. నాగరిత ఇంత ముందుకు పరుగు తీస్తుంటే, నువ్వు నీ మనమరాలిని వెనక్కు నడవమంటే ఎలాగ?'

'ఏమోనమ్మా ఈ నాగరికతయూ అదీ నే నెరగను...బొట్టు వేసుకుని పరుగు పెడ్తోంది. కాలు జారుతుందో ఏమో' సణుక్కుంటున్న అమ్మమ్మను చూచి పక పక నవ్వింది పెద్ద మనమరాలు వాసంతి.

'జారదులే అమ్మమ్మా. నీది మరీ చాదస్తం'

బుగ్గలు నొక్కుకుంది లక్ష్మమ్మ.

'అవ్వ! పెళ్ళయినదానివి నువ్వు. పెళ్ళి కావలసిన పిల్ల అది. నువ్వు దానికి చెప్పాల్సిందిబోయి, వెనకేసుకొస్తున్నావ్.'

'పెళ్ళి కావల్సిన పిల్లని, కాబోయే మొగుణ్ణి గురించి కలలుకంటూ మూల కూర్చోవాలా అమ్మమ్మా' అమ్మమ్మ అమాయకత్వానికి విరగబడి నవ్వింది వసంత. నవ్వు తెరల మధ్యగా మరలా తనే అంది.

'అమ్మమ్మా నీ కెన్నేళ్ళకు పెళ్ళయిందే! అప్పుడు నీకు మాటలొచ్చా అమ్మమ్మా'

'ఏమి ముదనష్టపు పిల్లలబ్బా సిగ్గూ, బిడియంలేదు...' అని మనుమరాలిని తోసేసి లేచిందామె. ఆమె కోపం వెనకాల కన్పించిన సన్నటి సిగ్గుతెరను చూచి నన్నగా నవ్వుకుంటూ వెళ్ళిపోయింది వసంత. అమ్మమ్మ వాడిపోయిన కళ్ళల్లో, కోపాన్నీ, సిగ్గును చూచిన వసంత కమ్ముకొస్తున్న విచార ఛాయలను గమనించ లేకపోయింది.

లక్ష్మమ్మ తల్లిదండ్రులకు ఆరుగురు ఆడసంతానం తర్వాత ఒకేఒక్క మగపిల్లాడు పుట్టాడు. వాడి ముద్దుముచ్చటలు చూడకుండానే వాళ్ళు పరలోక గతులయ్యారు. రామచంద్రరావని పేరుపెట్టి అక్కలు వాడిని అల్లారుముద్దుగా పెంచారు. పెద్దక్క అయిన లక్ష్మమ్మకీ, రామచంద్రరావుకీ

శరం తోడా లేకపోయినా, శరమంత తోడా వుంది. రామచంద్రరావు పుట్టకముందే ఆమెకు పెళ్ళి అయింది. ఇద్దరు బిడ్డలకు తల్లి అయినా అవకముందే ఆమెకు వైధవ్యం ప్రాప్తించింది. భర్త బ్రతికున్నకాలంలో అడపా దడపా దెబ్బలుతిన్నా ఒకరికొకరుగా బ్రతికారు వాళ్ళు. ఆయన పోవడంతో ఆమె దెబ్బతిన్న పక్షే అయింది. ఇద్దరు కూతుళ్ళమీదే ఆశలు పెట్టుకుని బ్రతికింది. రెండో కూతురు శ్యామలను; తమ్ముడికిచ్చి పెళ్ళి చేసింది. ఇద్దరు బిడ్డలూ అత్తవారింటి కెళ్ళిపోవడంతో ఆమె మరలా ఒంటరిదైపోయింది. 'రామా కృష్ణా' అనుకునే వయస్సులో ఆ వృద్ధురాలికి మరో అఘాతం తగిలింది. ఒకరోజు దేవునిగదిలో పూజలో వుండగా వార్త వచ్చింది. 'శ్యామల హఠాత్తుగా పోయింది. వెంటనే రమ్మనమని' 'శ్రీమన్నారాయణా! ఈ వయస్సులో నాకెందుకు తండ్రీ ఈ శిక్ష విధించావ్. నాకు ముందే చెప్తే నా ఆయుస్సుపోసి నా శ్యామలను బ్రతికించుకోక పోయానా భగవంతుడా!' అని రాతి బొమ్మ పాదాలమీద పడి రోదించిందామె.

ఇటు తమ్ముడి కాపరంలో దీపం ఆరిపోయినందుకు బాధపడుతున్న ఆమెకు, అటు కూతురు శాశ్వతంగా శలవు తీసుకున్నందుకు విలపిస్తున్న ఆమెకు, పిల్లలను ఓదార్చే బాధ్యత సమస్య అయింది. వాళ్ళు ఎదిగిన పిల్లలు. వాళ్ళను ఓదార్చే భాష ఆమెకు రాదు.

'అమ్మ మమ్మల్ని వదిలి వెళ్ళిపోయింది అమ్మమ్మా' అని బావురుమన్న పద్దెనిమిదేళ్ళ రాఘవేంద్ర, పదహారేళ్ళ వాసంతి, పన్నెండేళ్ళరాణిని, ప్రక్కలో కూర్చోబెట్టుకుని చెప్పిందామె 'అందరం ముందో వెనకో పోవలసిన వాళ్ళమే తల్లీ. శ్యామలకు ముందే పిలుపొచ్చింది. అంతే...అంతే,' ఆ వృద్ధురాలు తన మనుమలను ఓదారుస్తుందేగాని, ఆమెకూ ఈ వియోగం భరించరానిదిగా వుంది 'తన గర్భంలోనుండి వచ్చిన శ్యామల తనకంటె ఎంత చిన్నది! అప్పుడే ఎందుకు రావాలి పిలుపు?'

'తల్లీ శ్యామలా! నిన్ను కన్నప్పుడు వేనుకోలేదే నీచావు చూడాల్సి వస్తుందని. కన్నబిడ్డ చావు చూడాల్సి రావడం...ఎంత ఖర్మ చేసుకున్నాను నేను!'

అమ్మమ్మ ముడతలుపడ్డ చెంపలమీదగా కారిపోతున్న కన్నీళ్ళను తుడుస్తూ అంది రాణి వెక్కిళ్ళ మధ్యగా,

'ఏడవకమ్మమ్మా భయమేస్తోంది.'

'లేదు పసిడీ, ఏడవడం లేదమ్మా' ఆ పిల్లను హృదయానికత్తుకుందామె. ఇలానే కొన్ని సంవత్సరాల్క్రితం శ్యామలను తమ్ముడి వెంట పంపుతూ హృదయానికి హత్తుకున్న అనుభూతి కలిగిందామెకు.

'అప్పుడే ఎందుకు వెళ్ళిపోయ్యావు శ్యామలా. ఎంతమంది పిల్లలని సాకేది? ఇంకా నీ ముసలితల్లికి అంత సత్తువ వుందనుకుంటున్నావా?'

ఆమె నీరసించిన కళ్ళల్లోనుండి నాలుగు నీటిబొట్లు పసిడి తలమీద పడి ఇంకి పోయాయి.

అలా శ్యామల స్థానం భర్తీ చెయ్యడానికి, లక్ష్మమ్మ ఆ ఇంట్లో స్థిరపడిపోయింది.

* * *

'శ్యామల పోయి అప్పుడే మూడేళ్ళయిపోయింది' అని ఒంటరిగా కూర్చుని నిట్టూరుస్తున్న లక్ష్మమ్మ ప్రక్కన వచ్చి కూర్చుంది రాణి స్నేహితురాలు రమ.

'ఏంటమ్మమ్మా ఆలోచిస్తున్నావ్.'

'ఈ పాపిష్టి కళ్ళతో నీ పెళ్ళి చూచే యోగం వుందో లేదోనని ఆలోచిస్తున్నాను' అని బోసి నోటినిండుగా నవ్వింది లక్ష్మమ్మ.

రమ కూడా నవ్వి అంది.

'ఇంట్లోకూడా నా పెళ్ళికి తొందర పడుతున్నా రమ్మమ్మా. చెప్పు, చేసేసుకోమంటావా అమ్మమ్మా' పదహారేళ్ళ రమకూ, అరవైఏళ్ళ లక్ష్మమ్మకూ మధ్య విచిత్రమైన స్నేహముంది. ఆ పిల్ల ప్రతిదీ అమ్మమ్మకు చెప్పి సలహా తీసుకుంటుంది.

'బాబోయ్! అమ్మమ్మ బుద్ధులు నేర్చుకోకే రమా' అని ఏడిపిస్తూ వుంటుంది రాణి.

'చేసుకోతల్లీ, ఏ వయస్సులో ఏది జరగాలో అది జరిగిపోవాలి.'

'ముక్కూ ముఖం తెలియని వాడివెంట వెళ్ళాలంటే భయమేస్తుంది అమ్మమ్మా'

'పెళ్ళిళ్ళు స్వర్గంలో జరుగుతాయి తల్లీ. నువ్వతని ముక్కూ ముఖం తెలుసుకోవాలనుకున్నా; తెలుసుకున్నది పాటుకు నిజమని ఏముందమ్మా'

లక్ష్మమ్మ చెప్పిన మాటలు మౌనంగా విని 'రాణి ఎక్కడమ్మమ్మా' అంటూ లేచింది రమ.

'రాణీ! ఈరోజు నాకు పెళ్ళివారు వచ్చారు.'

'అమ్మదొంగా నాకు చెప్పనే లేదు' అని ఎగిరి గంతేసి రమ ప్రక్కన వచ్చి కూర్చుంది రాణి.

'అతనెలా వున్నాడు? బాగున్నాడా? చదువుకున్నాడా? మీరిద్దరూ మాట్లాడుకున్నారా? ఏమి మాట్లాడుకున్నారు?'

స్నేహితురాలి ఆతృతకు సన్నగా నవ్వుకుంటూ చెప్పింది రమ.

'బాగున్నాడు, చదువుకున్నాడు. కానీ మాట్లాడుకోవాలని అతను అడగలేదు'

రాణి ఉత్సాహమంతా చల్లారిపోయింది.

'ఒట్టి బ్రూట్‌లా వున్నాడు. కాకపోతే ఒకరిభావాలు ఒకరు తెలుసుకోకుండా పెళ్ళి చేసుకోవడమేమిటి?'

రమ మాట్లాడలేదు.

'వద్దు రమా! ఇతను కాకపోతే మరొకడు. నువ్వతనితో మాట్లాడాలి. ఏపార్కుకో సినిమాకో వెళ్ళి అతని తత్వం అర్థం చేసుకోవాలి. అసలు నన్నడిగితే— ప్రేమించందే పెళ్ళి చేసుకోకూడదంటాను'

రెండు విరుద్ధమైన సలహాల పందిరి క్రింద నిల్చుని తన స్వంత నిర్ణయం ఏదో చేసుకోవడానికి వెళ్ళిపోయింది యుగసంధిలో జన్మించిన రమ.

* * *

'రాముడూ! పసిడి ఇంకా రాలేదురా' స్నేహితులతో సినిమాకి వెళ్ళిన మనమరాలు ఇంకా తిరిగిరాలేదని ఆరాటపడుతుందామె.

'వస్తుందిలే అక్కా. నువ్వెళ్ళి భోంచేసి పడుకో' నిశ్చింతగా చెప్పి తన ఫైల్స్‌లో మునిగిపోయారు రామచంద్రరావుగారు.

'అదేవిటేరా! ఎదిగిన ఆడపిల్ల రాత్రి పూట ఊళ్ళమ్మట తిరుగుతుంటే నీకు చీమ కుట్టినట్లయినా లేదు.'

'ఈకాలంలో కూడా ఆడామగా తేడా ఏమిటక్కా నీ పిచ్చిగాని. రేపు మన రాణి ఈ దేశానికి ప్రెసిడెంట్ కావచ్చు'

'ఒరే నువ్వెన్నయినాచెప్పు ఆడది ఆడదే' అని ఆగి 'అసలే తల్లిలేని పిల్ల. రేపు

లోకం నన్ను దుమ్మెత్తి పోస్తుంది' అంటూ కంట తడిపెట్టుకుంది కూతురు జ్ఞాపకానికి రాగా.

'అయితే నన్నేం చేయమంటావక్కా' విసుక్కున్నారాయన.

'ఇక చదివించింది చాలు ఆపెయ్యి. మంచి సంబంధంచూచి ముడిపెట్టేద్దాం. ఈలోపల సినిమా లకదీ పంపించకు. పెళ్ళయ్యాక దానిష్టం, దాని మొగుడిష్టం.' ఆయన పకపక నవ్వారు.

'నీ మనమరాలు ఉద్యోగం చెయ్యా లంటుంది ఎలా మరి?'

'పిచ్చి తండ్రీ స్త్రీకి సృష్టికంటె పెద్ద ఉద్యోగ మేముందిరా?'

ఆయన మాట్లాడలేదు. తన సిద్ధాంతాలు తన తమ్ముడికి నచ్చలేదని నిట్టూర్చి లేస్తుండగా వాకిట్లో కారు శబ్దమయింది. తన అభియాన్ని మర్చిపోయి, వాకిట్లోకి నడిచిపోయిందామె.

కారులోనుండి రాణీ, రఘు దిగారు. కారులో ఇంకా ఒక అమ్మాయి ఇద్దరబ్బాయిలు వున్నారు. వాళ్ళు టా టా చెప్పేసి వెళ్లిపోయారు. మనవడికీ, మనమరాలికీ అన్నం వడ్డిస్తూ అంది ఆమె.

'నువ్వా వెళ్ళావట్రా రాఘవా సినిమాకి? అలా అని తెలిస్తే ఇంత గాభరా పడక పోదునుకదా!'

'మధ్యలో కలిసాం అమ్మమ్మా' అని తొంచేయడంలో లీనమయిపోయాడు.

'ఓరే రాఘవా! వాళ్ళునీస్నేహితులట్రా! అందరూ కలిసే వెళ్లారా?'

'నా స్నేహితులు కాదు అమ్మమ్మా రాణి స్నేహితులు' అని చెప్పి రియాక్షన్ కోరకు అమ్మమ్మవైపు చూచాడు రాఘవేంద్ర.

'అదికాదురా ఆ మగపిల్లాళ్ళ గురించి నేనడిగేది.'

'ఆఁ వాళ్ళగురించే చెప్పిందికూడా' అని చెల్లెలివైపు తిరిగి చిరునవ్వు నవ్వాడు రాఘవేంద్ర.

లక్ష్మమ్మకిదంతా విచిత్రంగా తమాషాగా వుంది. ఆమెకు తెలుసు తనింకా తరచి అడిగితే అన్నా, చెల్లి ఇద్దరూ కలిసి తనను అవహసిస్తారని. అందుకే వాళ్ళకు వహావంగా వడ్డించివచ్చి పడవలో కొంగు పరచుకుని పడుకుంది. కానీ ఆమెకు నిద్రపట్టడం లేదు సరిగా. కలత నిద్రమండి ఉలిక్కిపడి లేచికూర్చుంది.

'అమ్మా నా కూతురిని నీ చేతుల్లో పెట్టాను. ఇలాగేనా అమ్మా పెంచేది ?, శ్యామల నిలదీసి అడుగుతున్నట్లని పించింది. మనవడిగదిలో ఇంకా లైటు వెలుగుతోంది. వాకిలిదాకావెళ్ళి తిరిగొచ్చింది. ఆమెకు తెలుసు వాడు తన మాటలను కొట్టిపడేస్తాడని, నాగరికత పేరుచెప్పి అవమానిస్తాడనీ. అయినా ఆ ముసలి ప్రాణానికి రాజీ కుదరలేదు. మరలా లేచి నేరుగా మనవడిదగ్గర కెళ్ళిందామె.

'రాఘవా !'

'ఏం అమ్మమ్మా'

'అది కాదురా పసిదికి తెలియదనుకో నువ్వయినా చెప్పకూడదట్రా. అలా మగ పిల్లలతో తిరిగితే లోకం నవ్వుతదిరా'

'అది మీకాలం అమ్మమ్మా. ఈ కాలంలో ఎవరు ఎలా పోయినా ఎవరూ పట్టించుకోరు.'

'ఎవరూ పట్టించుకోరని బురదలో పడుస్తామా నాయనా'

'తర్వాత కడుక్కుంటే బురదపోతుందిలే అమ్మమ్మా. విసిగించక వెళ్ళి పడుకో'

'అంతే తెలుసురా నీకు. అంతే తెలుసు' ఆమె గొణుక్కుంటూ వెళ్లిపోయింది.

* * *

'అమ్మమ్మా !' తన ఒడిలో చేరి వెక్కి వెక్కి ఏడుస్తున్న రాణిని చూచి లక్ష్మమ్మ గుండె నీరు కారిపోయింది.

'ఏమి తల్లీ! ఏం కష్టం వచ్చిందమ్మా నీకు. నాతో కాకపోతే ఇంకెవరికి చెప్పు కుంటావే పసిడీ, చెప్పమ్మా'

రాణి కళ్ళల్లోనుండి నీళ్ళు కారి పోతున్నాయేగాని. జవాబు రావడంలేదు.

'నాన్నగారేమన్నా అన్నారా ?'

తల అడ్డంగా త్రిప్పింది రాణి.

'నీ స్నేహితుల్లో పిల్లలేమయినా అన్నారా? చెప్పు ఎవరేమన్నారో చెప్పు. నా తల్లిని అనడానికి ఎన్నిగుండెలుండాలి వాళ్ళకి?!'

'అమ్మమ్మా !' బావురుమంది రాణి.

'ఎంత బాధ లేందే కళ్ళనీళ్ళు నింపు కుంటావు ! నా బంగారుతల్లివి కదూ ! నాకు చెప్పవూ పసిడీ, నేను అమ్మమ్మను కాదూ !' వదిపేవెళ్ళ పసిడిని—ఒళ్ళోకి లాక్కుని బుజ్జగించింది లక్ష్మమ్మ.

'అమ్మమ్మా !'

'ఏం అమ్మా. చెప్పు తల్లి చెప్పరా' మనమరాలి వెన్ను రాస్తూ బతిమలాడిందామె.



వెక్కిళ్ళమధ్యగా తలివంచుకుని మెల్లగా అంది రాణి,

'నాకు మూడోనెలట అమ్మమ్మా'

'అంటే...అంటే...'

రాణి అమ్మమ్మవైపు నీళ్ళునిండిన కళ్లతో భయంభయంగా చూస్తోంది. మెల్లి మెల్లగా ఆ వృద్ధురాలికి అంతా అర్థమవు తోంది. ప్రపంచమంతా మోసంగానూ, ఆ ప్రపంచంలో వంచించ బడ్డది అమాయకురాలైన తన పసిడి ఒక్కటేనని అన్పించ సాగిందామెకు.

'పాపిష్టిదానా! ఎంతపని చేసావే!' వడలిపోయిన ఆమె బుగ్గలమీదుగా వేడి కన్నీరు జారిపోతోంది. ఆమె పెదాలు అస్పష్టంగా గొణుక్కుంటున్నాయి.

'నీకు అందరూ 'రాణి' అని పేరు పెడ్తే, పసిడి ముద్దలా వున్న నిన్ను చూచి సంబరపడి 'పసిడి' అని పిల్చుకున్నాను. కానీ...ఆ బంగారం మైలపడి పోయింది.'

'పరలోకంలో వున్న శ్యామలకు ఏమి జవాబు చెప్పాలి తనిప్పుడు?'

శ్యామల పోయినప్పుడు ఏడ్చిన ఆ వృద్ధురాలు మరలా ఈనాడు మనమరాలి భ్రష్టమైన జీవితాన్ని తలచుకుని ఏడుస్తోంది.

'ఏడవకమ్మమ్మా, భయమేస్తోంది'

ఉలిక్కిపడింది లక్ష్మమ్మ. శ్యామల పోయినప్పుడు తను కంట తడిపెడ్తుంటే ఇలానే...అచ్చు ఇలానే అంది ఆ పసిపిల్ల. పసిడి ఏమీ ఎదగలేదు ఎదగని పసిడి తప్పు చేసింది. దానికి బాధ్యులు ఎవరు? తను కాదా!' ఆమె ఆత్మవిమర్శ చేసుకుంటోంది.

'అమాయకురాలు, పసిపిల్ల అయిన ఈ మొగ్గను, భద్రంగా కాపాడలేదు తను. మొగ్గ విడకముందే వెలుగును చూడమని ప్రపంచంలోకి విసిరివేసారు. ప్రతి పురుగునూ భ్రమరం అనుకునే పసిడి మోసపోయింది.'

మనమరాలిని కొద్దిగా ముందుకు వంచి ఆపిల్ల కళ్లల్లోకి తదేకంగా చూస్తోందామె.

'భగవంతుడా! ఈ పసిడి బంగారాన్ని ఎందుకు మలిన పర్చావు? అపవాదులన్ని భరించి బ్రతకమనా నాకింకా ఆయుస్సు పోస్తున్నావు?'

ఆమె తేరుకుని ఈలోకంలో పడేసరికి విశికాంత సాగమ దిద్దుకుంటోంది. మనమరాలిని శేవవెల్తి కూర్చొబెట్టి సిరసన్వరావ


తల్లినుండి పిల్లకు పారంపర్యా వుడ్‌వార్డ్స్' వార్త వాడుకగా వస్తోంది

మీ శిశువును

వుడ్‌వార్డ్స్

గ్రైప్ వాటర్‌తో

ఆరోగ్యంగాను, ఆనందంగాను వుంచండి

తరతరాలనుంచి తెలివైన తల్లులు తమ శిశువులకు వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్‌ను వాడియున్నారు. వుడ్‌వార్డ్స్' కడుపులో కుట్టు నొప్పి, పైత్యం, వాయువు మరియు పళ్ల వచ్చునప్పటి ఇబ్బులు, ఈ బాధల నుండి తక్షణ విముక్తి కలిగిస్తుంది.



సురక్షితంగా వుండండి.
నిబ్బరంగా వుండండి.
సర్వదా ఒక సీసాను
దగ్గిరుంచుకోండి.




వుడ్‌వార్డ్స్' గ్రైప్ వాటర్
తెలివైన తల్లులు
వంద ఏళ్లకు మించి
వాడుచున్నారు.

AT. 30 TL

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సాతో
చికిత్సను పొందండి
శస్త్రచికిత్స
అవసరముండదు!
DOL-327 TEL

వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్

ప్రపంచ ప్రఖ్యాత 3 బ్యాండ్ ఆల్ వరల్డ్ (జపాన్ మాడల్) 'SONEO' ట్రాన్సిస్టర్ ఇండియాలోకూడా నెలకు రు.10/- చొప్పున చెల్లించి పొందగలరు. ప్రతి గ్రామము, పట్టణానికి పంపవచ్చును.
వివరములకు:
SONEO INDIA
P. B. 1142, (WAP) Delhi—6.

1969 లో మీ అదృష్టము
మీరు ఒక పోస్టు కార్డుమీద యే పుష్పము పేరునైనా వ్రాసి, మీ అడ్రసు తెలుపండి. మేము మీకు రాబోవు పన్నెండు నెలల్లో జరుగు ముఖ్య సంఘటనలు అనగా వ్యాపారంలో లాభ నష్టాలు, సర్వీసులో ప్రమోషన్ ట్రాన్స్ఫరు, పిల్లల జననం, వివాహం సుఖ సంతోషాలు

మరియు చెడు నక్షత్రాలకు శాంతి చేసుకొను విధానములు రు. 1-25 లకే పంపెదము. పోస్టేజీ ఆదనం. ఒకరు సమాధానాన్ని పొందగలరు.
PT. DEV DUTT SHASTRI
RAJ JYOTSHI (MAP)
P. B. 86. JULLUNDUR CITY.

# యుగ సంధి

అడిగింది.

'ఎవరు?'

రాణి కళ్ళు వాల్చేసుకుంది.

'ఎవరో తెలియదా?' తెలుసన్నట్టు తల వూపింది.

'అతనంటె నీ కిష్టమా?'

మౌనంగా అవునంది.

'అతనికి?...'

మాట్లాడలేదామె.

'మీ నాన్నగారితో చెప్పనా?'

భయం భయంగా చూచింది రాణి.

'ఎలా తల్లీ? నేను ఉత్త ఆడదాన్ని. పైగా నీకు తల్లినికూడా కాను. ఈ రహస్యాన్ని నాకడుపులో పెట్టుకుని దాచుకునే హక్కులేదు. ఏం చేయను నేను?'

మర్నాడు ఈవిషయాన్ని విన్న రామచంద్రరావుగారు ఉగ్రుడైపోయాడు. కాలు గాలిన పిల్లిలా ఇల్లంతా తిరిగారు.

'వాడికి బుద్ధిలేదనుకో. ఆడపిల్ల దీనికెందుకు బుద్ధిలేకపోయింది?'

'అదేవిట్రా! ఈకాలంలో ఆడామగా తేడా లేదన్నావుగదా?' అమాయకంగా అంది ఆమె. ఆయన అక్కమాటలు విన్పించుకోలేదు.

'ఎటువంటి వంశం మనది! వంశంలో మచ్చ తెచ్చాక ... ఇంతమచ్చ తెచ్చాక...' ఆయాస పడుతున్నారాయన.

'చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఏమిలాభం?' నిట్టూర్చిందామె.

ఉన్నట్టుండి కూతురువైపు తిరిగి గర్జించాడాయన.

'ఎవడు వాడు?'

'రాముడూ! ఆవేశ పడకురా. పసిదీ! నువ్వు లోపలకెళ్ళు' వాళ్ళిద్దరిమధ్య నలిగిపోతుంది. రెండు భావావేశాలు ఆమెను కుదిపేస్తున్నాయి.

మనమరాలిని లోపలకు పంపించేసి తమ్ముడి దగ్గరకొచ్చి ఆయన తలమీద చెయ్యివేసి అంది ఆమె 'చూడు రాముడూ! అతనెవరో కనుక్కో. ఆతర్వాత ఏం చేయాలో ఆలోచిద్దాం.'

'రఘూ' లోపలికి కేక వేశారాయన.

జరిగినదంతా విని అన్నాడు రఘు.

'బహుశ అతనే అయ్యుంటుంది' అని అతని తాలూకు వివరాలన్నీ చెప్పాడు రాజేంద్ర.

'అయితే వాడి కులం, గోత్రం కొన్ను కనుక్కోరా ముడిపెట్టేద్దాం.' అంది ఆమె సంతోషంగా.

'నీకేం తెలీదు ఊర్కో అక్కా. కులం గోత్రం ఒకటి కాకపోయినా పర్వాలేదు. కానికి పనికిరాని ఆ వెధవకుమాత్రం నా కూతురినివ్వను.' ఖచ్చితంగా చెప్పారాయన. కులం, గోత్రాలలో అందరూ సమానమే అంటున్న వీళ్ళు డబ్బు విషయంలో మరలా కొత్తరకం తెగల నెందుకు సృష్టించుకుంటున్నారో ఆమె మేధస్సుకు అందలేదు. అయినా ఆమె అవన్నీ ఆలోచించ దలచుకోలేదు. మనమరాలి జీవితం చక్కబడితే అంతేచాలు.

'మనం జరిగిపోయినదాన్ని గురించి కూడా కొద్దిగా ఆలోచించాలికదరా'

'అలా అని ఆ 'యూస్‌లెస్ ఫెలో'ని నా అల్లుణ్ణి చేసుకోనా? ఆతర్వాత నేను—తలెత్తుక తిరగాలా?' విసురుగా అక్కడ నుండి లేచి వెళ్ళిపోయా రాయన. డబ్బుతో కీర్తిప్రతిష్ఠలను కొనుక్కోవాలనుకుంటున్న తమ్ముణ్ణి తలంచుకుని ఆశ్చర్యపడుతున్న ఆమె మనవడి సలహాకు ఉలిక్కిపడింది. ఆమె పంచేంద్రియాలూ ముద్దగట్టుకు పోయాయి—

'అంత చిన్నదానికి ఇంత హంగామా ఎందుకు అమ్మమ్మా 'అబార్షన్' చేయిస్తే పోలా ?'

'ఒరే ఏమన్నావు? హంగామా చేస్తున్నానా నేను? ఇది చిన్న విషయంగా కన్పడుతోందా నీకు? ఇదా నువ్విచ్చే సలహా! ఎందుకురా మీ చదువులన్నీ గంగలో కలప డానికి'

'ఇంతకంటె పరిష్కారం మరిలేదు అమ్మమ్మా' అని లేచాడు మనవడు.

'ఎంత తేలిగ్గా చెప్పావురా. అది బొమ్మ కాదురా చేతో తీసి పడేయడానికి. తల్లి గర్భంలో జేరి తల్లిలో కోటి తియ్యటి తలపుల్ని రేపే శిశువు అది. మీ మగాళ్ళకేం తెలుస్తుంది గర్భం తీపి.'

ఆమెకిదందా చిత్రంగా, తమాషాగా వుంది. ఈ విషయంలోకూడా వీళ్ళందరూ తనను కొట్టిపడేసి దీనిని తేలిగ్గా తీసుకుంటారనుకుంది? ఇలా ఎందుకు జరి

గింది?—వీళ్ల నాగరికతకు అర్థం తెలియక బుర్ర బద్దలు కొట్టుకుంటున్న ఆమె దగ్గరకువచ్చి కూర్చుంది పెద్ద మనమరాలు వాసంతి.

'ఇప్పుడీ విషయం మా ఆయినకు, అత్తావాళ్లకి తెలిస్తే ఇంకేమయినా వుందా అమ్మమ్మా' అంటూ కంట తడిపెట్టుకుంది.

లక్ష్మమ్మ విస్తుపోయింది 'తన చెల్లెలికి జరిగిన అన్యాయానికి బాధపడాల్సింది పోయి, తన భవిష్యత్తును గురించి చింతిస్తోంది ఆమె. ఎంత స్వార్థం!'

'అదేమే, మీవాళ్లు ఇలాటివి అస్సలు పట్టించుకో రనుకుంటానూ, అదేదో క్లబ్బులకూ గట్రా తిరగతారని చెప్పావుగా'

'తిరిగితే ఇలాటి పనులు చెయ్యాలని వుందా?'

'మీరే దాన్ని దేశం మీదకు వదిలేసారు. మరలా...మరలా' ఆగిపోయిందామె. మనమరాలి మనసు నొచ్చుకుంటుందని ఆవేశాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ కాతరస్వరాన అంది.

'తిరగడానికీ, తప్పు చెయ్యడానికీ తెలియని వయస్సులో పిల్ల పసిడి. దానిని క్షమించు వాసంతీ.'

వాసంతి ఏమీ మాట్లాడలేదు. ఆ సాయంత్రమే అత్తవారింటికి ప్రయాణమయింది.

* * *

'ఇలా జరిగింది రమతల్లీ. ఇప్పుడు నన్నేం చేయమంటావు?' తన స్నేహితురాలూ, సలహాదారూ అయిన రమను తన బాధను అర్థంచేసుకోమని అర్థించిందామె.

'ఇన్నిఏళ్ల, నీ అనుభవంముందు నేనే పాటి అమ్మమ్మా. నీకు నేనేం చెప్పగలను?'

'అలా అనకు తల్లీ. నేను ఈ తరం దాన్ని కాదు. ఈ తరంలో దేన్ని మంచి అంటారో, దేన్ని చెడ్డ అంటారో నాకు తెలియదు. నేనేమి చేస్తే నాతల్లి బ్రతుకు నవ్వులపాలు కాకుండా వుంటుందో కాస్త చెప్పి నాకు దారిచూపించు రమ తల్లీ'

'అమ్మమ్మా!' అమ్మమ్మ ఎడల ఆరాధనతో ఆ పిల్ల కళ్లు ఆర్ద్రమయ్యాయి.

'నీ దగ్గర నేను నేర్చుకోవాల్సింది చాలా వుంది అమ్మమ్మా'

ఉన్నట్టుండి అడిగింది లక్ష్మమ్మ.

'నాగరికత అంటే ఏమిటి తల్లీ?'

'అందమైన గులాబీని కాగితం పువ్వుగా మార్చడం అమ్మమ్మా...అది ఒక భ్రమాచ్ఛన్నమైన బ్రతుకులే అమ్మమ్మా'

'అయితే తల్లీ, నే ననుకున్నది నిజం కాదా!'

'ఏమిటి అమ్మమ్మా!'

'నా తరానికీ, మీ తరానికీ మధ్యలో కరిగిపోయిన కాలంలో మీరు చాలా సాధించే రనుకున్నా నమ్మా' రమ వెంటనే జవాబు చెప్పింది.

'సాధించాలనే కోరికవుంది, సాధిదా మనే తపన వుంది. కానీ పూర్తిగా సాధించకముందే పరుగుతీసి బోర్లా పడిపోతున్నాము. ఏది మంచో ఏది చెడో, ఏది అవునో, ఏది కాదో తెలియని మిథ్యాయుగం ఇది. అందుకే మిడతల్లా మాడిపోతున్నాం'

'ఇంకా పాతసూత్రాల గ్రంథం మూసిపోలేదు. క్రొత్త సూత్రాల గ్రంథం తెరవబడనేలేదు. అందుకే ఏ సూత్రాలు అవలంబించాలో తెలియడంలేదు. ఒక సిద్ధాంతాన్ని హర్షించే మనిషి, ఆ సిద్ధాంతాన్ని అనుసరించే మనిషిని హర్షించలేక పోతున్నాడు. ఒకవ్యక్తిని తప్పుత్రోవలో త్రోసి మంచిగా బయట పడనందుకు ఆ వ్యక్తిని శిక్షిస్తున్నాడు. తన వస్తువును భద్రపరచుకోవడానికి బద్ధకించి, అది చేతుల్లోనుండి జారిపోయాక ఏడుస్తున్నాడు. ఇదీ అమ్మమ్మా మా నాగరికత.'

ఆమె అంతా శ్రద్ధగా విని అంది.

'నేను నా పాత పద్ధతుల్ని, ఆచారాల్ని, కులగోత్రాలను పట్టుకుని వేళ్లాడినా, నా సంతతి సుఖపడుతోందని మనసులో సంతోషించేదాన్ని. కానీ తల్లీ నా కిప్పుడిప్పుడే తెలుస్తోంది—మాదింకా నయం నరకంలో నడుస్తున్నామని తెలిసి అడుగులు అతి జాగ్రత్తగా వేసేవాళ్లం. మీరలా కాదమ్మా, స్వర్గంలో నడుస్తున్నామనే భ్రమలో, ఆ అతిశయంతో బ్రతికి ఒక్కసారుగా నరకపుద్వారం సమీపించేసరికి తట్టుకోలేక—పోతున్నారు.'

రమ అందుకుంది.

'కులమత తారతమ్యాలు నమసిపోతున్నాయని సంతోషించేలోపలే డబ్బును కేంద్రంగా తీసుకుని సరికొత్త తారతమ్యాలు కల్పించుకుంటున్నారు.'

'నరగ్రహాల్ని ఎలా చేరాలా అనే ఆలోచనల్లో, ముందుకుపోతున్న శాస్త్ర పరిజ్ఞానంలో, ఎదుటి మనిషికి ఒక మనసు వుందని మర్చి పోతున్నారు.'

'యుగం మారుతోంది కానీ కష్టాలు, సుఖాలు ఏం మారలేదు. కాకపోతే కష్టసుఖాలు ఈ యుగంలో రంగురంగుల దారాలతో నగిషీ చేసుకుంటున్నాయంతే.'

రాణి వెక్కివెక్కి ఏడుస్తున్న శబ్దంతో ఇద్దరికీ మెలుకువ వచ్చింది. మనమరాలిని పొదివిపట్టుకుని ఒడిలోకి తీసుకుంటూ అంది లక్ష్మమ్మ.

'చూడు రమా! ఈ పిల్లకు ఒక మనసంటూ వుందని వీళ్లు మర్చిపోతున్నారమ్మా. గర్భంలో కదలాడే పసికందును తీసెయ్యమని తేలిగ్గా చెప్తున్నారమ్మా' అలా అనేప్పుడు ఆమె గొంతులో చిత్రమైన విరక్తిభావం కదలాడింది.

'అయితే అమ్మమ్మా, నువ్వేం చేయాలనుకుంటున్నావు?' కొన్నినిముషాల మౌనం తర్వాత అడిగింది రమ.

'ఈ పసిదానికోరకు నేనేం చేయలేను తల్లీ!'

'అవును అమ్మమ్మా నువ్వు ఏమి చేసినా వెనక హింసించడానికి వాసంతక్కలాగ అత్తమామలు లేరు. కీర్తి పోతుందనుకోవడానికి, నీ కీర్తిని, సంస్కారాన్ని అసలెవ్వరూ గుర్తించనే లేదు.'

ఆ ముసలి ప్రాణం లేచి నిల్చుంది.

'నడువు పసిడీ. నా ఇంటికి పోదాం పద. నీకు మనస్థిమితం ఏర్పడ్డాక, తీరిగ్గా వివేకంగా ఆలోచించి ఓ నిర్ణయానికి వద్దువుగాని. ఇంతకంటె అవివేకురాల్ని, నేను సాహసించి ఏమి చెయ్యగలను?'

ఆ వృద్ధురాలు ఈ ఆధునికపు యుగ వరదాలను తప్పించుకొని, నాగరిక ప్రపంచాన్ని లెఖ్ఖచేయకుండా మనమరాలిని ముందుకు నడిపించుకు వెళ్తుంటే ఆమెను, చెమ్మగిలిన కళ్లతో ఆరాధనా పూర్వకంగా చూస్తోంది రమ. ●